క్లుప్తంగా

నేటి నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని గంధవరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్న పైడితల్లమ్మ ఉత్సవాలకు కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం రాత్రి గ్రామంలో అమ్మవారి తిరువీధి ఉత్సవం ఉంటుంది. సోమవారం సాయంత్రం ఉయ్యాల, కంబాల ఉత్సవం, రాత్రి గొర్రపోతు సంబరం జరుగు తాయి. మంగళవారం అమ్మవారి మాలలతో ఊరేగింపు, గుండాలు తొక్కడం, రాత్రి రథాల ఉత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

ఘనంగా హనుమజ్జయంతి

పీఎం పాలెం/మధురవాడ: హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. పీఎం పాలెం మూడో బస్టాప్ రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సిందూరాభిషేకాల అనంతరం ఎర్రని పుష్పాలతో అలంకరించారు. గారెలు, తమలపాకుల దండలు వేశారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గంభీరం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలోని గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ దరి శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని వివిధ వర్ణాల పుష్పాలతో అర్చించి, శాస్త్రోక్తంగా హోమం, పుష్పయాగం నిర్వహించారు. రాగ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. కె. నాగజ్యోతి సారథ్యంలో ఆలపించిన మహాలక్ష్మి, మొగదారమ్మ, విష్ణు సంకీర్తనలు అలరించాయి.

ఇద్దరు పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


కాపాడిన పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన ఆరుగురు పర్యాటకులు శనివారం మధ్యాహ్నం రుషికొండ బీచ్ వచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆయుష్ ఠాకూర్, సత్యం ఠాకూర్ కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ వీరిని గమనించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పర్యాటకులను సురక్షితంగా కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద శనివారం కొత్తగా ఏర్పాటైన అదనపు తరగతి గదులు, ప్రహరీగోడ, కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్ఏ ఏపీసీ డాక్టర్ చంద్రశేఖరరావు, ప్రిన్సిపాల్ గంగాకుమారి, కార్పొరేటర్ గంటా అప్పల కొండ పాల్గొన్నారు.

సిద్ధేశ్వర పీఠంలో దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ట

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని శనివారం ప్రతిష్టించారు. రుత్వికుల వేదమంత్రాలు, హోమాల మధ్య పీఠంలోని ప్రాంగణంలో ప్రతిష్టాపనా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట తప్పారు..


ధూళి రేగిపోతున్న సంగివలస-పాండ్రంగి రహదారి


ఛిద్రమైన రహదారి

సంక్రాంతిలోగా రోడ్డు వేస్తామన్న అధికారులు ■ ఆపై ఎన్నికలంటూ వాయిదా
ఉగాది వెళ్లినా కానరాని చర్యలు ■ వాయుకాలుష్యం, వ్యాధులతో ప్రజల అవస్థలు

తగరపువలస: కూటమి ప్రభుత్వం వస్తే రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతామని ఎన్నికల హామీలు కురిపించారు. 10 మాసాలు గడచిపోయింది. అయినప్పటికీ రహదారులు బాగుపడలేదు సరికదా మరింత అధ్వానంగా తయారయ్యాయి.

జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస జాతీయరహదారి నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి వెళ్లే రహదారి మరీ ఘోరంగా తయారైంది. పైపులైన్ కోసం తీసిన గోతులు సక్రమంగా పూడ్చకపోవడంతో నిత్యం ధూళి రేగి, రహదారికి ఇరువైపులా నివాసం ఉంటున్న వారు తినే ఆహారం, తాగేనీటిలో కలసిపోతుంది. దీంతో


అడుగడుగునా ధూళే ..

వారిలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు తలెత్తుతున్నాయి.

ఈ మార్గంలో రోజూ వాటర్ ట్యాంకర్లు, పదుల సంఖ్యలో విద్యాసంస్థల బస్సులు, ఇటుకబట్టీలకు సరకు రవాణా చేసే వాహనాలు వస్తుంటాయి. దీంతో ధూళి మరింత జఠిలమైన సమస్యగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఇబ్బందులు భరించలేని స్థానికులు పలుమార్లు వాహనాలను నిలిపివేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు స్థానికులతో కాళ్ల బేరానికి వచ్చారు. ముందుగా సంక్రాంతి నాటికి రోడ్లు వేస్తామని చెప్పారు. తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అంటూ వాయిదా వేశారు. ఇప్పుడు రోడ్లు గురించి అడిగితే ధూళి రేగకుండా ఉదయం, సాయంత్రం నీళ్లతో తడిపేసి వెళ్లిపోతున్నారు. దీంతో తరచూ ఈ మార్గంలో గోతులు, నీటితో తడచిన బురద కారణంగా ద్విచక్రవాహనదారులు బోల్తా పడుతున్నారు. మొక్కలు, ఆలయాలు, ఇళ్ల పరిసరాలు ఎర్రటి దుమ్ముతో నిండిపోతున్నాయి. యుద్ధప్రాతిపదికన రహదారులు నిర్మించకపోతే వాహనాలను అడ్డుకుంటామని పార్టీలకు అతీతంగా స్థానికులు స్పష్టం చేస్తున్నారు.


ఈ మార్గంలో ప్రయాణం నిత్యం నరకయాతన

ప్రమాదాలు, ఆరోగ్యపరమైన సమస్యలు..



సంగివలస జాతీయ రహదారి నుంచి శివాలయం ముందు గోస్తని గెడ్డ వరకు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రోజూ కాలేజీకి వెళ్లి రావడం చాలా కష్టమవుతోంది. రోడ్డు గోతులమయం కావడంతో మా బ్రాహ్మణవీధి ప్రజలు తరచూ ప్రమాదాలకు, అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. తాత్కాలికంగా రోడ్లను తడిపినంత మాత్రాన సమస్య తీరదు.

–ఎ.పవన్‌కల్యాణ్, బీటెక్ విద్యార్థి

తీరం వద్ద పటిష్ట నిఘా


సముద్రపు ఇసుక తరలింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్


రోడ్డుకు అడ్డంగా వేసిన భారీ బండరాళ్లు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లోని **తీరంలో ఇసుక** అక్రమ రవాణాపై అధి**కారులు స్పందించారు**. తిమ్మాపురం, మంగ**మారిపేట, ఉప్పాడ** తీర ప్రాంతాల్లో రాత్రి **వేళల్లో 6 నుంచి 8** అడుగుల లోతు తవ్వేస్తున్నారు. **దీంతో తీ**రంలో భారీ గోతులు **ఏర్పడడంతో, భ**విష్యత్తులో సముద్రం **మరింత ముందుకు** వచ్చే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం సాక్షి దిన పత్రికలో 'తీరాన్ని తవ్వేస్తున్నారు..' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆర్డీవో సంగీత్ మాథూర్ స్పందించారు. శనివారం ఆయన రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ భారీగా ఏర్పడిన గుంతలను చూసి, వెంటనే మూసివేయించారు. అదేవిధంగా వాహనాలు ఇటుగా రాకపోకలు సాగకుండా రోడ్డు మొత్తం బండరాళ్లతో మూసివేయించి, జేసీబీ ద్వారా రోడ్డును అడ్డంగా తవ్వి వేయించారు.

పునరావృతం కాకుండా చర్యలు: ఆర్డీవో

ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ సముద్రపు ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్, పోలీసు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. సమన్వయంతో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైతే ఈ ఇసుకను తరలిస్తున్నారో వాటి వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సముద్రపు ఇసుకను ఎవరు తవ్వేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలియజేశారు.

ఫిల్మ్ క్లబ్‌ను సందర్శించిన ఎమ్మెల్యేలు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురం వద్ద ఉన్న వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చర్ సెంటర్‌లోని గత నియమ నిబంధనలను అవసరమైతే మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వీఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న విష్ణు కుమార్ రాజుతో కలసి ఎమ్మెల్యే గంటా శనివారం ఈ సెంటర్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ వీఎఫ్ఎన్‌సీసీలో జరగనున్న ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. విశాఖలో ఉన్న వాల్తేర్‌క్లబ్, గోల్ఫ్ క్లబ్, సెంచరీ క్లబ్ ఎన్నో ఏళ్లుగా నడుస్తున్నా, ఇక్కడ ఫిల్మ్ నగర్ సెంటర్‌లా ఎప్పుడూ వివాదం కాలేదన్నారు.


వీఎఫ్ఎన్‌సీసీని సందర్శిస్తున్న ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు

రాజకీయాలకు అతీతంగా ఈ ఎన్నికలు జరిగేలా చూడమని సంబంధిత అధికారులకు తెలిపారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరి

భీమునిపట్నం: ఎదుగుతున్న పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి అధికారి జయదేవి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా భీమిలి తోటవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ప్రతిరోజు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. ఎదుగుతున్న పిల్లలకు ఇది ఎంతో అవసరమని, తద్వారా అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లల పెంపకం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తల్లులకు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవి, సూపర్‌వైజర్ కె.ప్రమీల, టీచర్లు కె.వెంకటలక్ష్మి, వి.విజయ పాల్గొన్నారు.


పౌష్టికాహార ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సిబ్బంది, చిన్నారులు, వారి తల్లులు

హనుమాన్ శోభాయాత్రకు ర్యాలీగా..


వేములవలస నుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్తున్న భక్తులు


దుర్గాలమ్మ ఆలయం వద్ద ర్యాలీలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

తగరపువలస/మధురవాడ: హనుమాన్ శోభాయాత్రకు ఆనందపురం మండలం వేములవలస నుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లారు. బంటుపల్లి కళ్లాల రోడ్డులో ప్రారంభమైన ర్యాలీలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన వందలాది మంది వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాషాయ జెండాలు, టోపీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. పువ్వుల మార్కెట్, వేములవలస కూడలి, బోయపాలెం మీదుగా ఈ ర్యాలీ నగరం వైపు సాగిపోయింది.

- చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం నుంచి భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. మధురవాడ నుంచి జూ పార్క్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మీదుగా ఆర్‌కే బీచ్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని ఆలయం వద్ద ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు తదితరులు ప్రారంభించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

మధురవాడ: తగరపువలస సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో అవంతి కళాశాల బస్సు సహా మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. జాతీయ రహదారిపై బోరవానిపాలెం వద్ద మధురవాడ నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న కారుకు టూ వీలర్ అడ్డుగా రావడంతో కారు డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో కారును అవంతి కళాశాల బస్సు, కళాశాల బస్సును ట్రావెల్ బస్సు ఒకదానికి ఒకటి వెనుకవైపు నుంచి ఢీకొట్టాయి. ఈ ఘటనలో 3 వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఆయా వాహనాల్లో ఉన్న విద్యార్థులు, ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. హైవేపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

మే 9 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలో కీతినపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను మే నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను ఆలయం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు, కార్యక్రమంలో ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కోశాధికారి వి.బంగార్రాజు, అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం


దాత వసంతరావుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మధురవాడకు చెందిన దరువూరి వసంతరావు లక్ష రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ని అందజేశారు. అక్కయ్యపాలెంలోని అబిద్‌నగర్‌కి చెందిన మహదేవ్ శ్రీధర్ లక్ష 116 విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నాగభూషణంకు నివాళులు

తగరపువలస: ఇటీవల మృతి చెందిన భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణంకు వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం నివాళులు అర్పించారు, ఆనందపురం మండలం వేములవలసలోని నాగభూషణం ఇంటి వద్దకు చేరుకున్న చిన్న శ్రీను ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిమి గంగరాజు బంక కృష్ణంనాయుడు, షిణగం అప్పలరాజు, షిణగం దామోదరరావు, ఇల్లపు వెంకటరావు, రౌతు వెంకటరావు, పడాల రాము తదితరులున్నారు.


నాగభూషణం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చిన్న శ్రీను

ఇంటర్‌లో మెరిశారు

కేజీబీవీల్లో మెరుగైన ఫలితాలు

తగరపువలస: ఇంటర్మీడియట్ పరీక్షలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

- ఆనందపురం కేజీబీవీలో ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ విద్యార్థిని ఎస్.వసంత 975, కె.హేమలత 958 మార్కులు సాధించారు. నలుగురు విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సర ఫలితాలలో 470 మార్కులకు గాను ఎల్.శ్రీయామిని 452, ఎన్.వాసవి 432 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాలయ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.
- ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 12 మంది పరీక్షలకు హాజరు కాగా ఆరుగురు విద్యార్థులు, ఫైనల్ ఇయర్‌లో 11 మంది హాజరు కాగా ఇద్దరు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ మొదటి సంవత్సర ఫలితాలలో పైల అభిరాము 417, సీఈసీ నుంచి మహమ్మద్ సూర్య 333 మార్కులు సాధించారు. సీఈసీ ఫైనల్ ఇయర్ విద్యార్థి సుష్మిత 700 మార్కులు సాధించారు. ఈ కళాశాల విద్యార్థిని సూర్య సివిక్స్‌లో 99 మార్కులు సాధించడం విశేషం.

భీమిలి కళాశాలలో 58శాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 58శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ తెలిపారు. ఇక్కడ 112మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 65 మంది ఉత్తీర్ణత పొందారు. సీఈసీలో భీమిలి నేరెళ్లవలస కాలనీకి చెందిన పైల ధనేష్ 929 మార్కులు, హెచ్ఈసీలో లొడగల గౌరినాయుడు 740 మార్కులు సాధించారు.

కూలీల పిల్లలు.. ఫలితాల్లో ఘనులు

ఈ కళాశాలలో ఎంపీసీ విద్యార్థిని మైలపల్లి త్రిలోచన అత్యధికంగా 981 మార్కులు సాధించింది. భీమిలి మండలంలో అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం గ్రామానికి చెందిన త్రిలోచన తల్లిదండ్రులు లక్ష్మణ్, ఎలమాజీ కూలిపనులు చేసుకుని జీవిస్తున్నారు. బైపీసీలో భీమిలి నేరెళ్లవలస కాలనీకి చెందిన ఎర్రిపిల్లి అనిత 976మార్కులు సాధించింది. ఆమె తల్లితండ్రులు జగన్, దేవి కూడా కూలిపనులు చేసుకుని జీవించేవారే కావడం విశేషం.

వృత్తివిద్య కోర్సుల్లో 92శాతం ఉత్తీర్ణత

వృత్తి విద్య కోర్సులను సంబంధించి 185మంది గాను 169మంది ఉత్తీర్ణత పొంది 92శాతం సాధించారు. ఇందులో ఎంపీహెచ్‌డబ్ల్యూలో 36మంది పరీక్షలకు హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం వృత్తి విద్య కోర్సుల్లో 168 మందికి గాను 111మంది ఉత్తీర్ణత పొంది 66శాతం సాధించారు. ఫస్టియర్ సాధారణ కోర్సుల్లో 143 మందికి గాను 47మంది ఉత్తీర్ణత పొంది 32.8శాతం సాధించారు.


సెకండియర్ విద్యార్థి సునీతను అభినందిస్తున్న చైర్మన్ నరసింగరావు

కేజీబీవీలో 98శాతం :స్థానిక కేజీబీవీలోసెకండియర్ బైపీసీలో 35మందికిగాను 34 మంది ఉత్తీర్ణత పొంది 98శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. ఆనందపురం మండలం జోడువానిపాలేనికి చెందిన బర్నికాని వెంకటలక్ష్మి 967 మార్కులు సాధించిందన్నారు. ఫస్టియర్‌లో 33 మందికి 26మంది పాసై,78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు.

శ్రీకృష్ణా జూనియర్ విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను బొడ్డ ఉషారాణి 461, బి.ప్రవల్లిక 459, బి.లేఖన 458, ఎ.గీతావర్షిని 452, టి.జగన్‌మోహన్‌రెడ్డి 448, పి.రాజ్యలక్ష్మి 448మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు గాను వై.భార్గవి 414, ఎ.రాజేష్ 409, సీఈసీలో 500 మార్కులకు గాను సీహెచ్ కుసుమ 453 మార్కులు సాధించారు. 20 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో సునీత 1000 మార్కులకు గాను 974 మార్కులు సాధించారు. శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు వారిని అభినందించారు.

పద్మనాభం కస్తూర్బాలో 88.4 శాతం

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో ద్వితీయ ఇంటర్‌లో ఎంపీసీలో 88.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. 26 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా.. 23 మంది ఉత్తీర్ణులయ్యారు. జి.దివ్య వెయ్యి మార్కులకు 907 మా ర్కులు, ఆర్.శిరీష 895 మా ర్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. మొదటి సంవత్సరంలో 41 శాతం ఉత్తీర్ణత లభించింది. 34 మందికి 14 మంది ఉతీర్ణులయ్యారు. ఎం.సుస్మిత 470కు 452 మార్కులు, బి.సంజన 421 మార్కులు సాధించారు.


ఎస్.వసంత (975) ఎంపీసీ కేజీబీవీ


కె.హేమలత (958) కేజీబీవీ


వెంకటలక్ష్మి (967) బైపీసీ, కేజీబీవీ

- రెడ్డిపల్లి ప్లస్-2స్కూల్లో ప్రథమ ఇంటర్‌లో సీఈసీలో 24 మందికి ఇద్దరు ఉత్తీర్ణులయ్యారు, ఎంపీసీలో ఏడుగురు పరీక్ష రాయగా ఎవరూ ఉత్తీర్ణులు కాలేదు.


జి.దివ్య (907) కేజీబీవీ


ఆర్.శిరీష (895) కేజీబీవీ

ఇంటర్ ఫలితాల్లో శ్రీబాసర విద్యార్థుల సత్తా

తగరపువలస: ఇంటర్ ఫలితాల్లో స్థానిక శ్రీబాసర విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్ బైపీసీలో కె.ధనలక్ష్మి 988, ఎం.మేఘన, కె.దివ్య 987, ఎంపీసీలో కొయ్య అలేఖ్య, జె.వి.ఎస్.డి.హర్షిణి, పి.ఝన్సీ, ఎ.రవితేజ 987 మార్కులు సాధించగా కె.మోహనకృష్ణ 986 మార్కులు సాధించాడు. 120 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, జోనల్ ప్రిన్సిపాల్ వి.వి.డి.రమేష్ అభినందించారు.

కొమ్మాది గురుకులంలో 95 శాతం ఉత్తీర్ణత

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని గురుకులంలో ఇంటర్ సెకండియర్‌లో 95శాతం, ఫస్టియర్‌లో 91శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ శాంతకుమారి చెప్పారు. ఎంపీసీలో మోద ప్రియాంక 983, బైపీసీలో జి.రమ్య 979 మార్కులు సాధించారన్నారు.

- ఫస్టియర్ ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల డీన్ గణేష్ తెలిపారు. మధురవాడ నారాయణ కాలేజీలో బోరహాసిని 470కి 466, చిల్ల భరత్ రెడ్డి 465 మార్కులు సాధించగా 460పైన 22మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్